మీ కుటుంబ సభ్యుడిలా మెలుగుతా..



ఫ్యాన్ గుర్తు చూపిస్తూ ప్రసంగిస్తున్న అదీప్‌రాజ్

- మరోసారి అవకాశం ఇవ్వండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ విజ్ఞప్తి
- హుషారుగా ఎన్నికల ప్రచారం



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ప్రచార పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్

పరవాడ: ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ.. మీ కుటుంబ సభ్యుడిగా మెలుగుతా.. మీరు మెచ్చుకొనేలా పనిచేస్తానని పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కన్నూరు, గొర్లివానిపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, బీసీ కాలనీ, పెదముషిడివాడ గ్రామాల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అడుగడుగునా ఆత్మీయ స్వాగతం

ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు కన్నూరు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి కృష్ణవేణి, ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీనివాసరావు, గొర్లివానిపాలెంలో సర్పంచ్ గొర్లి గోపిఅమ్మలు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మిఎరుకునాయుడు, పెదముషిడివాడలో సర్పంచ్ పల్లా నాగమణి, పార్టీ నాయకుడు పల్లా అప్పారావు (కబడ్డీ) ఆధ్వర్యంలో మహిళలు హారతులిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు.

ఆప్యాయంగా పలకరిస్తూ...

కన్నూరు, మడకపాలెం గ్రామాల్లో వృద్ధులను ఆప్యాయంగా పలకరించి జగనన్న పంపించిన పింఛన్ అందుతుందా! అని అడిగారు. దీని వృద్ధులంతా సంతోషం వ్యక్తం చేస్తూ మేమంతా జగన్ బాబు వెంటే అని స్పష్టం చేశారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో మళ్లీ ఫ్యాను గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే సంక్షేమ పథకాలు మీ ఇంటి వద్దకే చేరే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

మోసానికి కేరాఫ్ చంద్రబాబు

గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశాడన్నారు. ఇప్పుడు మళ్లీ ఏవో యామ మాటలు చెబుతూ కూటమి పేరుతో వస్తున్న వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీల్లో 99 శాతం పూర్తి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వలంటీర్లు పింఛన్లు ఇళ్లకు తీసుకెళ్లి ఇస్తే జగనన్నకు మంచిపేరు వస్తుందన్న అక్కసుతో వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి కక్ష సాధించారన్నారు. పేదలంటే చంద్రబాబుకు కనీస గౌరవం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు అందాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. పెద్ద మనస్సుతో ఫ్యాను గుర్తుపై ఓటేసి తనను రెండో సారి ఎమ్మెల్యేగా, ఎంపీగా బూడి ముత్యాల నాయుడులను గెలిపించాలని అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పెదముషిడివాడ వైస్ సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, పీఏసీఎస్ డైరెక్టర్ మడక సూరిబాబు, నాయకులు అలమండ నరేష్, కోరుకొండ వెంకటరమణ, మడక రమణ, కె.సత్యనారాయణ, యలమర్తి బుజ్జి, ఒమ్మి అర్జున పాల్గొన్నారు.



అవ్వా..మీరే మాస్టార్ క్యాంపైనర్లు..



విజయోస్తు.. అదీప్‌రాజ్‌కు విజయతిలకం దిద్దుతున్న మహిళ



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ప్రచార సభకు హాజరైన ప్రజానీకం

వైఎస్సార్‌సీపీలో 70 కుటుంబాల చేరిక



పెదముషిడివాడలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్

పరవాడ: పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి అప్పారావు ఆధ్వర్యంలో గ్రామంలో టీడీపీకి చెందిన 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో వారిని పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలు నచ్చి టీడీపీని వీడుతున్నట్లు ఆయా కుటుంబాల వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలు, నాయకులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని.. తన విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ కోరారు.

కార్పొరేటర్‌పై దాడి హేయమైన చర్య

- జనసేన నేత గల్ల శ్రీనును సస్పెండ్ చేయాల్సిందే..
- 88వ వార్డు టీడీపీ నాయకుల డిమాండ్



గల్లశ్రీనును సస్పెండ్ చేయాలని నిరసన తెలుపుతున్న 88వ వార్డు టీడీపీ నాయకులు



మొల్లి ముత్యాలనాయుడు నివాసంలో సమావేశమైన జిల్లా యాదవ సంఘం సభ్యులు

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు టీడీపీ కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడుపై దాడికి పాల్పడిన జనసేన నాయకుడు, పంచకర్ల రమేష్‌బాబు అనుచరుడు గల్ల శ్రీనివాసరావును తక్షణమే ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వార్డు టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్పొరేటర్‌పై దాడిని ఖండిస్తూ మంగళవారం వారు సతివానిపాలెంలో నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో టీడీపీ నాయకులు మాట్లాడుతూ గతంలో కోటనరవకు చెందిన టీడీపీ నాయకుడు ఆళ్ల సన్యాసిరావుపై కూడా జనసేన నాయకుడు గల్ల శ్రీను దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. పొత్తులో ఉన్న పార్టీ నాయకులతో దాడులు చేయించుకునే స్థితిలో టీడీపీ నాయకులు లేరని అన్నారు. తక్షణమే గల్ల శ్రీనును పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే తాము పొత్తులో ఉన్నా జనసేన అభ్యర్థి రమేష్‌బాబుకు సహకరించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ నేతలు ఒమ్మి సత్తిబాబు, గంతకోరు శివకుమార్, గవర సత్తిబాబు, ఆళ్ల శ్రీకాంత్, కర్రి సన్యాసిరావు, దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుపై చర్యలు లేకుంటే తదుపరి కార్యాచరణ

సబ్బవరం: 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడును జనసేన నాయకుడు గల్లశ్రీను తీవ్రంగా అవమానించడంపై జిల్లా యాదవ సంఘం సభ్యులు ఖండించారు. వెదుళ్లనరవలోని మొల్లి ముత్యాలనాయుడు నివాసంలో మంగళవారం సాయంత్రం జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు భర్ణికాన సాయినాథరావు అధ్యక్షతన జిల్లా యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. సత్తివానిపాలెంలో ఓ శుభ కార్యక్రమానికి హాజరైన ముత్యాల నాయుడుపై శ్రీను అనుచిత వాఖ్యలు చేసి అవమానించడమే కాకుండా వార్డు సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాస్‌పై భౌతిక దాడికి దిగి అన్యాయంగా కొట్టారన్నారు. దీనిపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టినప్పటికీ ఇంతవరకూ ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడంతో సమావేశం నిర్వహించామన్నారు. గల్లా శ్రీనును పార్టీ నుంచి సస్పెండ్ చేసి పొత్తు ధర్మాన్ని పాటించి కార్పొరేటర్ ముత్యాలనాయుడుకు న్యాయం చేయాలని పంచకర్ల రమేష్ బాబును సంఘం పెద్దలు కోరారు. లేని పక్షంలో తమ తదిపరి కార్యాచరణ ప్రకటించాల్సి వస్తుందని హెచ్చరిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బందం వెంకట రమణ, పరవాడ మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, జిల్లా యాదవ సంఘం సెక్రటరీ పల్ల తాతారావు, సీనియర్ నాయకులు కోరాడ శ్రీనివాసరావు, కోన సోమేశ్వరరావు, పల్ల సన్యాసిరావు, గజ్జి నర్సింగరావు, మొల్లి కనకరాజు, ఇప్పలి చిన్నారావు, చల్ల అప్పలనాయుడు, ఈపు అప్పలరాజు, ఈపు సంతోష్, పిల్లల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల బహిష్కరణ సమంజసం కాదు

- పెందుర్తి ఆర్వో శేషశైలజ
- తాడి గ్రామస్తులతో సమావేశం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్వో శేష శైలజ

పరవాడ: ఎన్నికలను బహిష్కరించడం సమంజసం కాదని పెందుర్తి ఎన్నికల నిర్వహణ అధికారి(ఆర్వో) శేషశైలజ అన్నారు. ఎన్నికలను బహిష్కరిస్తామని తాడి గ్రామస్తులు ఇటీవల జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. దీనిపై ఈ మేరకు అధికారులు మంగళవారం తాడి గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్వో శేషశైలజ మాట్లాడుతూ సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఓటు హక్కును ప్రజాస్వామ్యం బద్ధంగా సద్వినియోగం చేసుకొంటూ సమస్యలపై పోరాటం సాగించాలని సూచించారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆర్వో శేషశైలజ తాడి గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని వాపోయారు. అవగాహన సదస్సులో డీఎస్పీ కేవీ సత్యనారాయణ, తహసీల్దారు తిరుపతిరావు, సీఐ ఎస్.బాలసూర్యారావు, పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

త్రిపురేశ్వరి అలంకరణలో లలితాంబిక

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరిదేవి ఆరాధాన పీఠంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. లలితాంబిక అమ్మవారు త్రిపురేశ్వరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా కష్టాలు తొలగిపోవడంతో పాటు శత్రు వినాశనం సిద్ధిస్తుందని భక్తులకు ప్రగాఢ విశ్వాసం. యాగశాలలో దుర్గా,చండీ సహిత రశ్మి మాలా మంత్ర హవనం నిర్వహించారు.

కాలుష్యంతో అనారోగ్యాలు



స్వయంభూవరంలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. వెంటనే మూల స్వయంభూవరం గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఎన్టీపీసీ కాలుష్యంతో తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు కలుషితం కావడంతో తాగునీరు కొనుక్కోవాల్సి వస్తోందన్నారు. తమ ఇబ్బందులను గుర్తించి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కొత్తపల్లి బాబూరావు, భానుప్రసాద్, రమణ, లక్ష్మి పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ విద్యార్థుల ప్రతిభ

సింహాచలం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆస్పత్రి హెడ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 95 శాతం, ద్వితీయ సంవత్సరంలో 95 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మొదటి సంవత్సరంలో డి.నాగశ్యామల 534 మార్కులు(600), ద్వితీయ సంవత్సరంలో ఎస్.కె. వహీదా 1300 మార్కులు(1663) తెచ్చుకున్నారని తెలిపారు. కళాశాలకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులను ఆస్పత్రి జీఎం కె.రాధాకృష్ణన్, డీజీఎం కె.బంగార్రాజు అభినందించారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

- శ్రీరామనవమికి ముస్తాబైన రామాలయాలు



సింహగిరిపై ఉన్న ప్రాచీన రామాలయం



సింహపురికాలనీ ఆలయంలోని సీతారాములు



వాడచీపురుపల్లిలో కొలువుదీరిన సీతారాములు

సింహాచలం: శ్రీ రామనవమిని పురస్కరించుకుని రామాలయాలు ముస్తాబయ్యాయి. జగదభిరాముడి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించే విధంగా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు రామాలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

- సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో బుధవారం ఉదయం 10.30గంటల నుంచి సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో కల్యాణ క్రతువు ఆరంభించనున్నారు.
- 98వవార్డు పరిధి సింహపురికాలనీలోని రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన చేయనున్నారు.
- అడవివరం బ్రాహ్మణవీధి రామాలయం, విజినిగిరిపాలెంలోని రామాలయం, పాత అడవివరంలోని రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నవమి వేడుకలకు ఏర్పాట్లు

పరవాడ: మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి పలు గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. వాడచీపురుపల్లి, పరవాడ, తానాం, భర్నికం, గొర్లివానిపాలెం, వెన్నలపాలెం, కలపాక, నాయుడుపాలెం, పెదముషిడివాడ, కన్నూరు, తాడి తదితర గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రామాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఆలయాల ముంగిట చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ సత్యరాజు తదితరులు

సబ్బవరం: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా అగ్నిప్రమాదాలను నివారించవచ్చని సబ్బవరం అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు తెలిపారు.అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సబ్బవరంలోని ఆర్కిడ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు.విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు,వరదలు,భూకంపాలు వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది కె. రాజారావు,కె. ఎల్లాజీ, ఎం. శ్యామ్ కుమార్,కె. మహేశ్వరరావు,వి. ద్వారకాద్రి,ఎం. సత్తిబాబు పాల్గొన్నారు.

వెన్నలపాలెం బీసీ కాలనీలో చోరీ



వివరాలు అడిగి తెలుసుకొంటున్న సీఐ బాలసూర్యారావు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం బీసీ కాలనీకి చెందిన చుక్క రమాదేవి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 8 తులాల పావు బంగారు ఆభరణాలను దొంగిలించుకుపోయినట్లు బాధితులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. ఇంటికి వచ్చిన రమాదేవి చోరీ జరిగినట్లు గుర్తించింది. ఇంటికి వేసిన తాళం తొలగించి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. రమాదేవి నుంచి పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు పలు వివరాలు సేకరించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ నాగేశ్వరరావు

పెందుర్తి: రాష్ట్ర స్థాయి మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో స్థానిక బాలాజీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 3,4 తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది ప్రత్యేకంగా విద్యార్థులను అభినందించారు.

ఐదు కిలోల ముత్యాలు బహూకరణ



ముత్యాలను ఏఈవోకు అందజేస్తున్న దాత

సింహాచలం: ఈ నెల 19న సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని 5కిలోల ముత్యాలను నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన వి.శివకుమార్‌రాజు బహూకరించారు. కుటుంబ సమేతంగా వచ్చిన దాత సింహగిరిపై ముత్యాలను ఏఈవో ఆనంద్‌కుమార్‌కు అందజేశారు.